నేటి నుంచి డిజిటల్ కార్డుల గుర్తింపు సర్వే


కలెక్టర్ రిజ్వాన్‌బాషా

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: బహుళ ప్రయోజనాలు చేకూర్చే లక్ష్యంతో ప్రభుత్వం కుటుంబ డిజిటల్ కార్డులు జారీ చేసే ప్రక్రియను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నందున జిల్లాలోని రెవెన్యూ, పంచాయతీ, పురపాలిక, ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రిజ్వాన్‌బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి(గురు వారం) నుంచి ఈ నెల 7 వరకు క్షేత్రస్థాయిలో అధికారులు ఇంటింటికి తిరుగుతూ ఆయా కుటుంబాల సమగ్ర వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం నోడల్ అధికారులు, కోఆర్డినేషన్ అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు.

సర్వే షెడ్యూల్ నిర్వహణ ఇలా..

జనగామ మండలం ఎర్రగొల్లపహాడ్ పరిధిలోని పెద్దతండా(వై)లోని 138 కుటుంబాలను ఎంపిక చేసి ఎంపీడీవో, ఏఈవో, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, ఆశా కార్యకర్త, అంగన్వాడీ సిబ్బందితో కూడిన బృంద సభ్యులు సర్వేలో పాల్గొంటారని, వీరికి నోడల్ అధికారిగా డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, కోఆర్డినేషన్ అధికారిగా జడ్పీ సీఈవో సరిత వ్యవహరిస్తారని పాలనాధికారి తెలిపారు. ● జనగామ మున్సిపల్ పరిధిలోని 24వ వార్డులోని పాతబీటు బజార్, కుర్మవాడ, నాగులకుంటలోని 423 కుటుంబాలలో సర్వే జరుగుతుండగా, వీరికి నోడల్ అధికారిగా జనగామ ఆర్డీవో కొమురయ్య, కోఆర్డినేషన్ అధికారిగా జడ్పీ సీఈవో సరిత ఉంటారని చెప్పారు. వీరితోపాటు క్షేత్రస్థాయిలో మూడు బృందాలు ఉంటాయని వివరించారు. ● స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని రఘునాథపల్లి మండలం కన్నాయపల్లిలో 196, మాదారంలోని 178 కుటుంబాలను ఎంపిక చేసి జనగామ ఆర్డీవోను నోడల్ అధికారిగా, కోఆర్డినేషన్ అధికారిగా డీపీవో సరితతో పాటు క్షేత్రస్థాయిలో మరో రెండు బృందాలు ఉంటాయని పేర్కొన్నారు. ● పాలకుర్తి మండలంలోని రామవారంలో 165 కుటుంబాలను ఎంపిక చేసి నోడల్ అధికారిగా స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో వెంకన్న, కోఆర్డినేషన్ అధికారిగా డీఆర్డీవో వసంతతో పాటు మరో రెండు బృందాలు సర్వేలో పాల్గొంటాయి. కుటుంబ సభ్యుల వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎంపిక చేసిన కుటుంబాలను సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేయాలని సూచించారు.

వైభవంగా పూల పండగ




పాలకుర్తి: మంచుప్పలలో పాల్గొన్న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవాధ్యక్షురాలు విమలక్క


బతుకమ్మకుంట మైదానంలో..


మరిన్ని చిత్రాలు 9లో
పాలకుర్తిలో నిమజ్జనం చేస్తున్న చిన్నారి

జనగామ టౌన్, న్యూస్‌టుడే: బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో... ఒక్కేసి పువ్వేసి చందమామ.. అంటూ పాటల సందడి, తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలు.. మధ్యలో గౌరమ్మలను ప్రతిష్ఠించి బతుకునిచ్చే అమ్మగా మహిళలు కొలిచే బతుకమ్మ పండగ వేడుకలు జనగామలో బుధవారం నుంచి పెత్రామాసతో ప్రారంభమైంది. పట్టణంలోని బతుకమ్మకుంట మైదానం, పాతబీటు బజారులోని శివాలయం, ఆర్అండ్‌బీ అతిథి గృహం పక్కన మైదానంతో పాటు పలు వార్డుల్లో బతుకమ్మ వేడుకలు మొదటి రోజు ఘనంగా జరుపుకున్నారు. ఆట పాటలతో మహిళలు, యువతులు సందడి చేశారు.


తొర్రూరు: మాటేడులో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి..


జనగామ శివాలయం వీధిలో


లింగాలఘనపురంలో ఏకరూప చీరలు ధరించి బతుకమ్మ ఆడుతున్న మహిళలు


పట్టణంలో..

మహాత్ముడికి ఘన నివాళి


కలెక్టరేట్‌లో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, అధికారులు

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: మహాత్మ గాంధీ జయంతిని పురస్కరించుకొని బుధవారం జనగామ కలెక్టరేటులో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్.. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అహింస మార్గాన్ని ఎంచుకొని అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాడిన వ్యక్తి గాంధీజీ అని అన్నారు. సమానత్వం, శాంతికోసం ఆయన చేపట్టిన సిద్ధాంతాలు ఎందరికో ప్రేరణగా నిలిచాయన్నారు. ఆయన కన్న కలలు సాకారం అయ్యేలా, స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందేలా ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి బి.రవీందర్, వ్యవసాయాధికారి రామారావునాయక్, విద్యాశాఖాధికారి రాము, పశుసంవర్ధక శాఖ అధికారిణి రాధాకిషన్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్‌కు కడియం పరామర్శ



స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని బుధవారం స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హైదరాబాద్‌లోని ఉత్తమ్ నివాసంలో కలిసి పరామర్శించారు. ఇటీవల ఆయన తండ్రి పురుషోత్తంరెడ్డి మృతి చెందగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

పార్కింగ్ చేశారనుకుంటే పొరబడినట్లే




ఈ చిత్రంలో పోలీస్ స్టేషన్ ఎదురుగా వరుసలో పెట్టిన వాహనాలను చూసి పార్కింగ్ చేశారని అనుకుంటే పొరబడినట్లే.. రెండు రోజుల క్రితం జూదం ఆడుతూ టాస్క్‌ఫోర్సు పోలీసులకు జూదరులు పట్టుపడగా వారి వద్ద నుంచి ఆరు కార్లను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఠాణా ఎదుట వరుసగా వాహనాలను నిలిపారిలా.. – న్యూస్‌టుడే, స్టేషన్‌ఘన్‌పూర్

ఘనంగా కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం



జనగామ టౌన్, న్యూస్‌టుడే: కుల వివక్ష పోరాట సంఘం(కేవీపీఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని జనగామలో ఆ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ చౌరస్తాలో కేవీపీఎస్ జెండాను సంఘం జిల్లా అధ్యక్షుడు తూటి దేవదానం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బొట్ల శేఖర్ మాట్లాడుతూ.. కుల వివక్ష నిర్మూలనకు 1998లో కేవీపీఎస్ ఆవిర్భవించిందన్నారు. అంటరానితనం, దళితులపై జరుగుతన్న దాడులను ఎప్పటికప్పుడు ఎండగడుతూ పోరాడుతుందన్నారు. నాయకులు పల్లెర్ల లలిత, యాదగిరి, బొట్ల శ్రావణ్‌కుమార్, మనోహర్, సుల్తానా, రాములు, చంద్రకళ, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోతున్న వేలం బకాయిలు


సోమేశ్వరాలయ క్షీరాద్రి

పాలకుర్తి, న్యూస్‌టుడే: పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా మారింది చారిత్రక శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పరిస్థితి. ఒక వైపు కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నా.. మరో వైపు దేవస్థానం ఆదాయాన్ని మింగేందుకు కొందరు పావులు కదుపుతున్నారు. ఈ వింత ధోరణికి అడ్డుకట్ట వేయకపోతే పెద్దమొత్తంలో నష్టం కలుగుతుందని భక్తులు వాపోతున్నారు. కొబ్బరికాయలు, పూజా సామగ్రి అమ్ముకునే హక్కు సజావుగా సాగుతుందా?.. దశాబ్దాలుగా పాతుకుపోయిన వారికే ఎందుకు మళ్లీ టెండర్లు దక్కుతున్నాయి?.. బినామీ పేర్లతో సిండికేట్ సృష్టిస్తున్నదెవరూ?.. పేరుకుపోతున్న వేలం బకాయిలపై కథనం.

కొబ్బరికాయల టెండర్ల వివరాలు..

సంవత్సరం	వేలం(రూ.లక్షల్లో)	వసూలు(రూ.లక్షల్లో)	బకాయిలు(రూ.లక్షల్లో)
2015–16	16.56	10.50	6.06
2016–17	29.80	20.00	9.80
2017–18	34.71	23.85	10.85
2018–19	25.26	20.00	5.26

● సంవత్సరం ● వేలం(రూ.లక్షల్లో) ● వసూలు(రూ.లక్షల్లో) ● బకాయిలు(రూ.లక్షల్లో)

బకాయిలపై నీలినీడలు?..

పాలకుర్తి ఆలయానికి తరాల చరిత్ర ఉంది. ఇక్కడ సోమేశ్వరుడు, లక్ష్మీనరసింహుడు స్వయంభూవులుగా గుట్టపై వెలిశారు. ఆదాయం దండీగా ఉన్నా నిర్వహణ లోపిస్తోంది. ఇక్కడ కొబ్బరికాయలు, పూజా సామగ్రి అమ్ముకునే టెండర్లకు విపరీతంగా డిమాండ్ ఉంటుంది. దీంతో ఏటేటా కొందరు సిండికేట్‌గా మారి వేలం పెరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. కొత్త వారు రాకుండా, బయటే రహస్యంగా ముడుపులు అందజేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో దేవాలయానికి రూ.లక్షల్లో నష్టం వాటిల్లుతుంది. 2015 నుంచి 2019 వరకు సుమారు రూ.31.00 లక్షల బకాయిల వేలం డబ్బులున్నా.. ఇప్పటివరకు సరైనా రీతిలో వసూలు చేయలేదు. 2019 నుంచి కొంత మేర ఉన్నా, గత డబ్బులు చెల్లించడం లేదు. అడపాదడపా బకాయిదారులకు నోటీసులు ఇస్తున్నా.. చర్యలు కనపడటం లేదు. ఈ సారి 2024-25 ఏడాదికి గాను ఈనెల 27న వేలం ఉండగా, ఈ సిండికేట్ వ్యవహారం దేవాదాయశాఖకు తలనొప్పిగా మారింది. తాజాగా ఈవో.. నోటీసులతో పాటు బకాయిదారుల పేర్లను బ్లాక్ లిస్టులో పెడతామని చెప్పడంతో వసూళ్లపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఏమేరకు సాధ్యమవుతాయో చూడాలి.

బకాయిదారులకు నోటీసులు..



- మోహన్‌బాబు, ఇన్‌ఛార్జి ఈవో, సోమేశ్వరాలయం

గత టెండర్ల రికార్డులు లేవన్న ఆరోపణలు అవాస్తవం. బకాయిదారులకు పలమార్లు నోటీసులు వెళ్లాయి. వసూళ్లపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. బ్లాక్ లిస్టులో వారి పేర్లను పెట్టి అయినా, టెండరు ప్రక్రియ నియమ, నిబంధనల మేరకు జరిగేలా చూస్తాం.

తేమ మాటున.. ధరల దోపిడీ


మార్కెట్‌లోని అపరాల యార్డు ఆవరణలో మక్కలు ఆరబెడుతున్న రైతులు

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న రైతులకు ధరలతో చిక్కులు తప్పడం లేదు. పంటలో తేమ ఉందనే సాకుతో.. పదిరోజుల వ్యవధిలోనే.. క్వింటాపై సుమారు రూ.500 వరకు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. పంట ఉత్పత్తులు చేతికొచ్చే సమయానికి మార్కెట్‌లో ధర క్రమంగా తగ్గిపోతుండటంతో.. రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లోని వ్యాపారులు తేమ మాటున ధరల దోపిడీ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. నిన్నమొన్నటి వరకు క్వింటా రూ.3 వేలకు పైగా పలికిన మొక్కజొన్న ధర.. సరాసరి రూ.2,500 పడిపోయింది.

ధరల తరుగుదల క్రమం.. (క్వింటాకు రూ.లలో..)

తేదీ	ధర
సెప్టెంబరు	
12న	3,070
13న	2,930
17న	2,750
18, 19న	2,655
20న	2,640
23న	2,660
24న	2,590
25న	2,575
26న	2,595
27న	2,540
30న	2,560
అక్టోబరు	
1న	2,530

7,560 ఎకరాల్లో మొక్కజొన్న సాగు..

జిల్లాలో గతేడాది 4,646 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. మార్కెట్‌లో మక్కలకు ప్రభుత్వ కనీస మద్దతు ధర కన్నా.. రూ.200 నుంచి రూ.300 వరకు ఎక్కువ ధర రావడంతో.. ఈసారి మక్కలను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపించారు. దాంతో ఈ ఏడాది జిల్లాలో 7,560 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. గతేడాది ఎకరాకు 28 క్వింటాళ్ల వరకు దిగుబడి రాగా.. ఈసారి ఎకరాపై అదనంగా రెండు క్వింటాళ్ల ఎక్కువ దిగుబడి వచ్చిందని వ్యవసాయశాఖ అధికారులు వెల్లడించారు. గత జులై నుంచి ఆగస్టు వరకు అంతర్జాతీయ, జాతీయ పరిస్థితుల నేపథ్యంలో మక్కలకు మార్కెట్ చరిత్రలో ఎన్నడూ లేనంత ధరలు పలికాయి. సెప్టెంబరు మొదటి వారం నుంచి మార్కెట్‌కు పెద్దఎత్తున మక్కలు తరలివస్తుండటంతో.. వ్యాపారులు కుమ్మక్కై ధరలు తగ్గిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. మార్కెట్ అధికారులు నివేదికల తయారీకే పరిమితమై పోతున్నారని.. ధరల్లో వ్యత్యాసాలపై దృష్టి సారించి, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు చర్యలు తీసుకోవడంలేదని ఆరోపిస్తున్నారు.

తేమ లేకుండా జాగ్రత్తపడాలి..

- పోలెపాక నిర్మల, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి

మొక్కజొన్న రైతులు పంటలో తేమ లేకుండా జాగ్రత్త పడాలి. కళ్లాల వద్దే పంట ఆరబెట్టుకున్న తర్వాతే.. మార్కెట్‌కు తీసుకురావాలి. తద్వారా పండించిన పంటకు గిట్టుబాటు ధర వస్తుంది. మార్కెట్‌లో ఉద్దేశపూర్వకంగా వ్యాపారులు ధర తగ్గిస్తున్నట్లు భావిస్తే.. సంబంధిత యార్డు సూపర్‌వైజర్ ద్వారా నేరుగా నా దృష్టికి తీసుకురావాలి.

కావాలనే తగ్గిస్తున్నారు..

- సింగిరెడ్డి శోభ, రాఘవపురం, పాలకుర్తి మండలం, జనగామ



ఎకరంన్నర పొలంలో మక్కలను సాగుచేయగా.. రూ.20 వేల వరకు పెట్టుబడి ఖర్చయ్యింది. మొత్తం 35 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకురాగా.. క్వింటాకు రూ.2,450 చెల్లించారు. పదిరోజుల క్రితం ఇదే నాణ్యత కలిగిన పంటకు క్వింటాకు రూ.2,800 వరకు చెల్లించారు. కావాలనే ధర తగ్గిస్తున్నారు.

భూమి కౌలు తీసుకొని సాగు చేశా..

- కొంతం నర్సయ్య, తమడపల్లి(జి), జఫర్‌గఢ్ మండలం



గతేడాది మక్కలకు గిట్టుబాటు ధర వచ్చిందని ఈసారి రెండున్నర ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేశాను. రూ.30 వేల వరకు పెట్టుబడి కింద ఖర్చయ్యింది. వాతావరణ మార్పులు, కాండం తొలిచే పురుగు కారణంగా.. కేవలం 23 బస్తాలు మాత్రమే పంట దిగుబడి వచ్చింది. తీరా మార్కెట్‌కు వచ్చాక.. క్వింటాకు రూ.2,425 చెల్లించారు. పెట్టుబడి సైతం వచ్చేలా లేదు.

పండగ పూట దొంగలతో జాగ్రత్త

రఘునాథపల్లి, చిల్పూర్, న్యూస్‌టుడే: దసరా పండగ సెలవుల నేపథ్యంలో ఇంటిని వదిలి వివిధ గ్రామాలకు వెళ్లే వారు తమ ఇంట్లోని నగదు, బంగారు అభరణాలను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. రఘునాథపల్లి, చిల్పూర్ ఠాణాల్లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం ఉంటుందని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ పేర్కొన్నారు.

జగన్మాతకు హరిద్రాభిషేకం

రంగంపేట, న్యూస్‌టుడే: జగన్మాత శ్రీభద్రకాళి అమ్మవారికి బుధవారం ఉదయం హరిద్రాభిషేకం, పూర్ణాభిషేకం కనుల పండువగా నిర్వహించారు. ప్రధానార్చకుడు శేషు ఆధ్వర్యంలో 40 కిలోల స్వచ్ఛమైన హరిద్రా చూర్ణం(పసుపు)తో అమ్మవారికి అభిషేకం చేశారు. హరిద్రామయమైన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. భద్రకాళి శరణం మమః అంటూ ప్రణమిల్లారు. రాత్రి 7 గంటలకు శ్రీభద్రకాళి దేవీ శరన్నవరాత్రుల అంకురార్పణ పూజలు జరిగాయి. గురువారం ఉదయం అమ్మవారికి పూర్ణాభిషేకం, నవరాత్రి కలశ స్థాపన, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, ధ్వజా రోహణం కార్యక్రమాలు ఉంటాయని ప్రధానార్చకుడు శేషు తెలిపారు.


దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల అంకురార్పణ పూజలు

ఆర్డినెన్స్ రద్దు ప్రకటనపై హర్షం

కొడకండ్ల, న్యూస్‌టుడే: దశాబ్దాల క్రితం అమల్లోకి తెచ్చిన కాలం చెల్లిన చట్టం రద్దు చేయాలంటూ మూడేళ్లుగా పోరాటం చేస్తున్న ముగ్గురు పిల్లల సంతానం తల్లిదండ్రుల పోరాటం ఫలించిందని పోరాట కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గాంధీనాయక్ చెప్పారు. బుధవారం మండలంలోని మొండ్రాయిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లల సంతానం కలిగిన తల్లిదండ్రులకు పోటీ చేసే అవకాశం లేని చట్టాన్ని రద్దు చేస్తూ ఆర్డినెన్స్ తీసుకువస్తామని ప్రకటించడం పట్ల ముఖ్యమంత్రికి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. బుధవారం కోమటిపల్లి క్రీడా మైదానంలో జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కరీంనగర్ జట్టు 49.3 ఓవర్లలో 192 పరుగులు చేసింది. విఘ్నేష్ 55, అఫ్రిది 35 పరుగులతో రాణించారు. ఛేదనలో నిజామాబాద్ జట్టు 30 ఓవర్లలో 74 పరుగులకే కుప్పకూలింది. 118 పరుగుల భారీ తేడాతో కరీంనగర్ జట్టు విజయం సాధించింది. మొగిలిచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో ఆదిలాబాద్‌పై ఖమ్మం జట్టు గెలుపొందింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆదిలాబాద్ జట్టు 29.3 ఓవర్లలో పది వికెట్ల నష్టానికి 109 పరుగులు చేసింది. ఖమ్మం జట్టు 30.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. గురువారం కోమటిపల్లి మైదానంలో ఖమ్మం, నిజామాబాద్: మొగిలిచర్ల మైదానంలో ఆదిలాబాద్, కరీంనగర్ జట్ల మధ్య మ్యాచ్‌లు ఉంటాయని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

జీఎన్‌ఎం కోర్సులో ప్రవేశానికి ప్రకటన

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలోని నర్సింగ్ స్కూల్‌లో జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ(జీఎన్‌ఎం)లో మూడేళ్ల కోర్సులో చేరేందుకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) ప్రకటన జారీ చేసింది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 1వ తేదీ నుంచి 17 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఈ నెల 29న సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. వివరాలకు http:///dme.telangana.gov.in వెబ్‌సైట్ చూడాలన్నారు.

బహు పౌష్టికం.. బతుకమ్మ ప్రసాదం

బతుకమ్మ ప్రసాదం ఆరోగ్యదాయం. వాటిని చిరుధాన్యాలతో తయారుచేయడం వల్ల పోషకాలు మెండుగా ఉంటాయని హనుమకొండకు చెందిన ప్రముఖ న్యూట్రిషనిస్టు జ్ఞానేశ్వర్ తెలిపారు.





పువ్వులతో దేవుడిని పూజిస్తారు.. ఆ పువ్వులనే దేవతలుగా, ఆడబిడ్డలే ఇంటి ఆరాధ్యదేవతగా పూజించే గొప్ప ప్రకృతి పండగ బతుకమ్మ. అనుబంధాలు, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచే ఈ పండగలో ప్రసాదాలు సైతం ప్రత్యేకతను సంతరించుకుంటాయి. పూలతో తయారు చేసిన రంగు రంగుల బతుకమ్మలను చెరువు గట్లమీదకు తీసుకెళ్లి ఆడిపాడిన తర్వాత ఆడబిడ్డలు తెచ్చుకున్న ప్రసాదాలు ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకుని ఆత్మీయతను పంచుకుంటారు. తొమ్మిది రోజులు రోజుకో తీరు ప్రసాదాలు(సద్ది)ని తీసుకెళతారు. తరచి చూస్తే ప్రతి సద్దిలోనూ చిరుధాన్యాలతో తయారు చేసినవి ఉంటాయి. బతుకమ్మకు రోజుకో రకంగా సమర్పించే ప్రసాదాలు.. వాటి ఆరోగ్య ప్రాముఖ్యం గురించి ప్రత్యేక కథనం..

- న్యూస్‌టుడే, కాజీపేట

1 ఎంగిలిపూల బతుకమ్మ



● **ప్రసాదం:** ఊక(ముడి)బియ్యం, బెల్లం కలిపిన ముద్దలు చేస్తారు.

● **ప్రయోజనం:** ముడి బియ్యంలో బి కాంప్లెక్సు ఉంటుంది. కొందరు నూకలతో చేస్తారు కాబట్టి త్వరగా జీర్ణం అయ్యే కార్బోహైడ్రేట్స్ అధికంగా ఉంటాయి.

మహబూబాబాద్‌లోని వేణుగోపాల స్వామి ఆలయంలో..

2 అటుకుల..



● సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో పెసర లేదా కందిపప్పును నానబెట్టి దానినే ప్రసాదంగా తీసుకెళతారు. అటుకులనే ప్రధానంగా సద్దిగా తీసుకెళతారు కాబట్టి దీనిని అటుకుల బతుకమ్మ అంటారు.

● పెసరపప్పులో ఎక్కువగా ప్రొటీన్‌లుంటాయి. బెల్లంలో ఇనుము ఉంటుంది. ఇది బాలికలకు, మహిళలకు మేలు చేస్తుంది.

3 ముద్దపప్పు



● ముద్దపప్పు, బెల్లం, పాలతో ప్రసాదం చేసుకుని తీసుకెళతారు.

● ఇందులో బెల్లం ఉంటుంది. మహిళల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. శరీరానికి కావాల్సిన ఇనుమును అందిస్తుందని ప్రముఖ న్యూట్రిషనిస్టు రమాదేవి తెలిపారు.

4 నానబియ్యం



● నానబెట్టిన బియ్యానికి పాలు, బెల్లం కలిపి వండుతారు. ఈ ప్రసాదం వేడిగా ఉండటానికి బతుకమ్మ ఆడడానికి కొద్ది సమయం ముందు తయారు చేసుకుని వెళతారు.



● ఇందులోనూ బెల్లానికి ప్రాధాన్యం ఇస్తారు.

5 అట్ల..



● బియ్యం పిండిని అట్లుగా పోస్తారు. వీటికి కొందరు బెల్లం లేదా చక్కర కలపడం వల్ల తీయగా ఉంటాయి.

● మంచి పోషకాహారం. ఎదుగుదలకు తోడ్పడుతుంది.

6

6వ రోజు బతుకమ్మ పండగకు సెలవు. ఈ రోజు అలిగిన బతుకమ్మగా పిలుస్తారు. ఆటకు దూరంగా ఉంటారు.

7 వేపకాయల



● సకినాలు చేసే పిండి పదార్థాన్ని చిన్న చిన్న వేపకాయలంత పరిమాణంలో ముద్దలుగా చేసి నూనెలో కాలుస్తారు. ఇవి వేపకాయల్లాగా ఉంటాయి కాబట్టి వేపకాయల బతుకమ్మ అంటారు.

● ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఇంట్లో తయారుచేసుకోవచ్చు. శరీరానికి అన్ని రకాల పోషకాలు అందుతాయి.

8 వెన్న ముద్దల



● వెన్నతో తయారు చేసిన నువ్వుల ఉండలను ఫలహారంగా చేస్తారు. వెన్న, నెయ్యి, నువ్వులు శరీరానికి కావాల్సిన ప్రొటీన్‌లు, కాల్షియం అందిస్తాయి.

● వెన్న, నెయ్యి పిల్లల ఎదుగుదలకు ఉపయోగపడుతాయి.

9 సద్దుల బతుకమ్మకు సత్తుపిండి

మొక్కజొన్న గింజలు వేయించి. . వాటిని పొడి చేసి బెల్లం రవ్వలు కలిపిన పిండినే సత్తుపిండి అంటారు. సద్దుల బతుకమ్మ రోజు ఇది చాలా ప్రత్యేకం. సజ్జలలాంటి చిరుధాన్యాలతో సద్ద ముద్దలు చేస్తారు అందుకే దీనిని సద్దుల బతుకమ్మ అంటారు. ఈరోజు సద్ది(ప్రసాదాలు) ఎక్కుగా తీసుకెళతారు కాబట్టి దీనిని సద్దుల బతుకమ్మ అని కూడా పిలుస్తారు.

● పెరుగన్నం, , చింతపండు పులిహోర, నిమ్మకాయ కొబ్బరి తురుము సద్దులను చేస్తారు. సత్తుపిండి, కొబ్బరి పొడి, నువ్వుల పొడి, మలీద ముద్దలు, పులిహోర, కొబ్బరి తురుము, పండ్లు సమర్పిస్తారు. ఇవన్నీ ఆరోగ్యదాయం..



భద్రకాళి.. నమోః నమామి!



రంగంపేట, న్యూస్‌టుడే: వేదవ్యాసుడు రచించిన శ్రీదేవీ భాగవతం ప్రకారం నవరాత్రులు దేవీ ఆరాధనకు ప్రత్యేకమైనవి. విజయదశమి సందర్భంగా శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తారు. జగన్మాత నవరాత్రుల్లో తొమ్మిది రూపాలుగా దర్శనమిస్తుంది. అమ్మవారికి ఏరోజు ఏం ప్రసాదం, ఏ చీర సమర్పించాలనేది దేవీ భాగవతంలో పొందుపర్చారు. భద్రకాళి ఆలయంతో పాటు ఉమ్మడి జిల్లాలోని అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

అవతారాలు.. అలంకరణ

మొదటిరోజు: బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తారు. ఈ రోజు అమ్మవారికి లేత గులాబి రంగు వస్త్రాన్ని సమర్పిస్తారు. క్షీరాన్నం నైవేద్యం.

2వ: అమ్మవారు వేదమాత శ్రీగాయత్రి దేవిగా దర్శనమిస్తారు. నారింజ రంగు వస్త్రం, కొబ్బరి అన్నం నివేదిస్తారు.

3వ: అమ్మవారు ప్రాణకోటి ఆకలి తీర్చే అన్నపూర్ణ మాతగా దర్శనమిస్తారు. పసుపురంగు వస్త్రం, అల్లం గారెలు సమర్పిస్తారు.

4వ: శ్రీలలితా మహాత్రిపుర సుందరీదేవిగా దర్శనం. ముదురు బంగారు రంగు వస్త్రం, కదంబం ప్రసాదాన్ని నివేదిస్తారు.

5వ: శ్రీచండీ దేవిగా కొలుస్తారు. భవానిమాతగా దర్శనం, ఎర్రని వస్త్రం, ప్రసాదంగా చింతపండు పులిహోర, రవ్వకేసరి.

6వ: శ్రీమహాలక్ష్మిగా దర్శనం. ముదురు గులాబి రంగు వస్త్రం, పూర్ణం బూరెలు ప్రసాదం.

7వ: శ్రీసరస్వతి దేవిగా దర్శనం. తెల్లని వస్త్రం, నైవేద్యంగా దద్దోజనం.

8వ: దుర్గాష్టమి, మహా దుర్గాలంకరణ, ఎర్రని వస్త్రం, ప్రసాదంగా నిమ్మకాయ పులిహోర.

9వ రోజు: మహానవమి, మహిషాసుర మర్దిని అలంకరణ, ఆకుపచ్చని వస్త్రం, చక్కెర పొంగలి ప్రసాదం.

విజయదశమి: విజయదశమి పర్వదినం రోజు అమ్మవారికి సామ్రాజ్య పట్టాభిషేకం, ఎరుపు, ఆకుపచ్చ రంగు వస్త్రాలు సమర్పిస్తారు. లడ్డూలు, పులిహోర, రవ్వకేసరి నైవేద్యం.

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక.. మంత్రి చేయూత



పలిమెల, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన కావేరి జ్యోతి పారా అథ్లెటిక్స్ అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది. డిసెంబరులో కంబోడియా దేశంలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు తమకు రూ.లక్ష ఖర్చవుతోందని, తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు కావడంతో నగదు సమకూర్చడం వారికి భారంగా మారింది. ఈ నేపథ్యంలో 'అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ క్రీడలకు ఎంపిక.. అడ్డంకిగా మారిన పేదరికం' అనే శీర్షికతో మంళవారం ఈనాడులో ప్రచురితమైన కథనానికి బుధవారం కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు దందెర రాజేందర్ స్పందించారు. మహాదేవపూర్ మండల పర్యటనకు వచ్చిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు యువతి సమస్యను వివరించారు. నగదు సమస్యను రెండు రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్ శర్మని ఆదేశించారు. మంత్రి యువతిని సన్మానించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చి దేశానికి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు.

చికెన్ ధరలు వెన్‌కాబ్ (కిలో వెల రూపాయలలో)		
	ఫాంరేటు: 110	డ్రెస్డ్: 191
	రిటైల్: 132	స్కిన్‌లెస్: 218

పేదల బతుకులపై పిడుగు

● ముగ్గురి మృతితో విషాదం

● ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే

వర్షాకాలం పిడుగుపాటు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. బుధవారం ఉమ్మడి వరంగల్‌లో ముగ్గురు మృత్యువాత పడడం విషాదాన్ని మిగిల్చింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రంగాయపల్లి గ్రామానికి చెందిన మహిళ రైతు కె.లక్ష్మి (45) మిరప తోటకు పిండి చల్లుతున్న క్రమంలో పిడుగు పడటంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం చౌలపల్లి గ్రామంలో వ్యవసాయ కూలీలు నిర్మల (51), రమ (45) అదే గ్రామానికి చెందిన రైతు పొలంలో పత్తి ఏరి ఇంటికి వచ్చే క్రమంలో పిడుగుపాటుకు గురై ప్రాణాలు కోల్పోయారు. కూలీ పనికి వెళ్తే తప్ప పూట గడవని ఆ పేద కుటుంబాలు తీరని దుఃఖంలో మునిగిపోయాయి. పట్టణాలు, పల్లెలు ఎక్కడైనా పిడుగులు పడే అవకాశముంటుందని వాతావరణ శాఖ నిపుణులు అంటున్నారు. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం..

అపార్ట్‌మెంట్లూ అతీతం కాదు

చాలా మంది అపార్ట్‌మెంట్లపై పిడుగు పడదన్న భ్రమలో ఉంటారు. అలాంటిదేమీ లేదని, రానున్న రోజుల్లో పిడుగుల ముప్పు మరింత పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు అంటున్నారు. ముందస్తు చర్యలతో పిడుగుపాటు ప్రమాదాన్ని నివారించవచ్చని చెబుతున్నారు. వరంగల్ నగరంలో 1000కి పైగా అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. వాటి సంఖ్య వేగంగా పెరుగుతోంది. పిడుగులు పడకుండా సరైన భద్రతా చర్యలు తీసుకోవడం లేదు.



● ఆరు నెలల కిందట హనుమకొండ నగరంలోని గాంధీనగర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌పై పిడుగుపడటంతో పాక్షికంగా దెబ్బతింది.



గాంధీనగర్‌లోని ఓ భవనంపై ఏర్పాటు చేసిన లైట్నింగ్ కండక్టర్

నిబంధనలను పాటించాలి

ఎత్తైన భవనాలు, చెట్లు పిడుగులను ఎక్కువగా ఆకర్షిస్తాయి. అందువల్ల భవన నిర్మాణ పనులలో నిబంధనలను కచ్చితంగా పాటించాలి. ప్రతి ఎత్తైన భవంతిపై తప్పనిసరిగా లైట్నింగ్ కండక్టర్లు ఏర్పాటు చేసుకోవాలి. దీనిలో పొడవాటి రాగి, ఇత్తడి తీగను భవనం పైభాగాన అమర్చాలి. దానికి ఎర్త్ కనెక్షన్ ఇచ్చుకోవాలి. దీనికి విద్యుత్తును ఆకర్షించే శక్తి ఉంటుంది. ఇది పిడుగు ప్రభావం భవంతిపై పడకుండా అడ్డుకుంటుంది. చూసేందుకు ఇది చిన్న ఏర్పాటే కావొచ్చు. వేల వాల్టుల విద్యుదావేశాన్ని రాగి కడ్డీ ఆకర్షించి ఎర్త్ కనెక్షన్ ద్వారా భూమిలోకి పంపేస్తుంది.

ఇదీ కారణం..

క్యుములో నింబస్ మేఘాలు ఏర్పడిన సమయంలో తీవ్రమైన గాలులు, ఉరుములు, మెరుపులు వస్తుంటాయి. పిడుగు పడిన ప్రాంతంలో ఏదైనా బుగ్గి కావాల్సిందే. కొన్ని లక్షల ఓల్టుల విద్యుత్తు తరంగాలు మేఘాల నుంచి భూమిలోకి ప్రవహిస్తాయి. నీటి ఆవిరితో ఉన్న మేఘాలు ఒక్కదానికొకటి తాకడం వల్ల విద్యుత్తు పుడుతుంది. ఈవిద్యుతే పిడుగుల రూపంలో భూమిపై పడి ప్రాణ, ఆస్తి నష్టానికి కారణమవుతున్నాయి.

అయ్యో పాపం.. ఎంత కష్టం..

● పెళ్లైన ఐదు నెలలకే యువతికి రెండు కిడ్నీల్లో సమస్య

● డయాలసిస్‌తో సాగుతున్న జీవనం

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి: కూతురుకు స్తోమతకు తగినట్లు పెళ్లి జరిపించారు. బాధ్యత తీరిందనుకున్నారు ఆ అమ్మానాన్న.. ఎన్నో ఆశలతో కొత్త కాపురానికి వెళ్లింది.. మెట్టి నింట్లో భర్తతో ఆనందంగా సాగిపోతోంది జీవితం.. ఇంతలోనే పిడుగు లాంటి వార్త.. నవ వధువుకు రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని వైద్యులు చెప్పడంతో రెండు కుటుంబాలు తీరని విషాదంలో మునిగిపోయాయి. ఆ యువతి జీవన్మరణ పోరాటం చేస్తోంది.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ఒడితల గ్రామానికి చెందిన కోడూరి అనూషకు ఏడాది కిందట బంధువుల అబ్బాయితో వివాహమైంది. ఆయన హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. పెళ్లయిన ఐదు నెలలకు ఓరోజు అనూషకు తీవ్రమైన జ్వరం వచ్చింది. వైద్యులు పరీక్షించి రెండు కిడ్నీలు పనిచేయడం లేదని నిర్ధారించారు. కొద్దిరోజుల్లోనే మరింత అనారోగ్యానికి గురయ్యింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రోజు విడిచి రోజు డయాలసిస్ చేయిస్తున్నారు. మందులకు, డయాలసిస్‌కు రెండు రోజులకు రూ.5 వేల చొప్పున అవుతున్నాయని, దాదాపు ఇప్పటి వరకు రూ. 11 లక్షల వరకు ఖర్చు చేశామని కుటుంబ సభ్యులు తెలిపారు. అయినా కిడ్నీ మార్పిడికి, శస్త్ర చికిత్సలకు దాదాపు మరో రూ. 10 లక్షలకు పైగానే ఖర్చవుతాయని తెలిపారు.. రోజూ వ్యవసాయ కూలీ పనులు చేసుకుని బతికే తమకు అంత ఖర్చు భరించే స్తోమత లేదని, ఇప్పటికే అప్పులు చేసి వైద్యం అందిస్తున్నామని తండ్రి పైడయ్య పేర్కొన్నారు. దాతలు ఆదుకుంటేనే బిడ్డ దక్కుతుందని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం, దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.



ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న అనూష

● దాతలు సహాయం చేయదల్చుకుంటే చరవాణి నంబర్లు 85209 63145, 99129 42026 కి సంప్రదించాలి.

కేయూ ఉప కులపతి ఎవరో?

● రేపు సెర్చ్ కమిటీ సమావేశం

కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం 15వ ఉప కులపతిని నిర్ణయించడం కోసం ఈ నెల 4న సెర్చ్ కమిటీ సమావేశం కానుంది. 14వ ఉప కులపతిగా బాధ్యతలు నిర్వహించిన సామాజికశాస్త్రం విశ్రాంత ఆచార్యులు తాటికొండ రమేష్ పదవీకాలం ఈ ఏడాది మే 21న ముగిసింది. ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారి వాకాటి కరుణను ఇన్‌ఛార్జి ఉప కులపతిగా నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా పలు వర్సిటీలకు ఉప కులపతులు లేకపోవడంతో కొత్తవారిని నియమించడం కోసం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా కేయూ వీసీ నియామకం కోసం జేఎన్‌టీయూ విశ్రాంత ఆచార్యులు ఆవుల దామోదర్ (కేయూ నామిని), జమ్మూ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య సంజీవ్ జైన్ (యూజీసీ నామిని), రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి (ప్రభుత్వ నామిని)లతో సెర్చ్ కమిటీని నియమించారు.

158 మంది పోటీ..: విశ్వవిద్యాలయ ఉప కులపతి పదవిని దక్కించుకోవడం కోసం రాష్ట్రంలోని పలు వర్సిటీలు, విద్యా పరిశోధన సంస్థల నుంచి పలువురు పోటీపడుతున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా తీవ్రమైన పోటీ నెలకొంది. 158 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో కేయూ ఆచార్యులు నలుగురు బరిలో ఉన్నారు. ప్రస్తుత రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి (గణిత విభాగం), దూర విద్య కేంద్రం సంచాలకులు వి.రామచంద్రం (రాజనీతిశాస్త్రం), టి.యాదగిరావు (ప్రభుత్వ పాలనా శాస్త్రం), టి.శ్రీనివాస్ (సామాజికశాస్త్రం)లు పదవిని ఆశిస్తున్నారు.

8 మంది విశ్రాంత ఆచార్యులు..: కేయూలో 30 ఏళ్లపాటు బోధన, పరిశోధన, పరిపాలన సేవలను అందించిన ఆరుగురు విశ్రాంత ఆచార్యులు కూడా దరఖాస్తు చేసుకున్నవారిలో ఉన్నారు. వీరిలో జి.దయాకర్, వి.రవీందర్ (రసాయనశాస్త్రం), కె.పురుషోత్తం (ఆంగ్లం), ఎం.అశోక్‌కుమార్, వెంకటనారాయణ (అర్థశాస్త్రం), బి.ఐలయ్య (తెలుగు), టి.శ్రీనివాసరావు (వాణిజ్యశాస్త్రం), సీహెచ్ దినేష్‌కుమార్ (రాజనీతిశాస్త్రం)లు దరఖాస్తు చేసుకొన్నారు.

14న దరఖాస్తుల పరిశీలన..: ఈ నెల 4న రాష్ట్ర సచివాలయంలో సెర్చ్ కమిటీ సమావేశం కానుంది. దరఖాస్తు చేసుకున్న ఆచార్యుల, విద్యావేత్తల బయోడేటాలను పరిశీలిస్తుంది. బోధన, పరిశోధన, పాలన అనుభవాలను పరిగణలోకి తీసుకుంటుంది. అత్యంత ప్రతిభ కలిగిన ముగ్గురి పేర్లతో జాబితాను గవర్నర్‌కు అందజేస్తారు. వీరి నుంచి ఒకరిని కేయూ ఉప కులపతిగా నియమిస్తారు. ప్రక్రియ సజావుగా సాగితే 15 రోజుల్లో కేయూకు కొత్త వీసీ రానున్నారు.

డెంగీ లక్షణాలతో విద్యార్థిని మృతి

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: డెంగీ లక్షణాలతో విద్యార్థిని మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగెం దేవేందర్, రమ దంపతుల కుమార్తె కల్యాణి(22) హైదరాబాద్ అమీర్‌పేటలో ఉంటూ ఓ కోచింగ్ సెంటర్‌లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం శిక్షణ తీసుకుంటోంది. ఆమెకు కొన్ని రోజుల క్రితం జ్వరం రావడంతో స్వగ్రామానికి వచ్చింది. హనుమకొండలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా డెంగీ వచ్చినట్లు వైద్యులు నిర్ధారించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది.



కల్యాణి (పాత చిత్రం)

గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య

● ఏకలవ్య ఆశ్రమ పాఠశాల భవనాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని

కొత్తగూడ, న్యూస్‌టుడే: కొత్తగూడ మండలం పొగుళ్లపల్లిలో రూ.40కోట్లతో నిర్మించిన ఏకలవ్య ఆదర్శ ఆశ్రమ పాఠశాల(ఈఎంఆర్‌ఎస్) నూతన భవనాన్ని బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ ఝార్ఖండ్‌లోని హజారిబాగ్ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. వెనుకబడిన గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు నెలకొల్పిన వీటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని కొనసాగించారు. ప్రారంభ శిలాఫలకాన్ని పీవో ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అత్యున్నత ప్రమాణాలతో రూ.40కోట్ల వ్యయంతో ఈ ఆశ్రమ పాఠశాలను నిర్మించినట్లు చెప్పారు. ఇప్పటికే ఈ గురుకులంలో 500 మంది గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికి తీయడానికి అత్యుత్తమైన బోధన అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో అలివేలు, జడ్పీ సీఈవో నర్మద, ఆర్‌సీవో హరిసింగ్, మండల ప్రత్యేకాధికారి సురేష్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో రవీంద్రప్రసాద్, గురుకుల ప్రిన్సిపల్ అజయ్‌సింగ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా


పట్టణంలోని శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో..


వేయి స్తంభాల గుడి ఆవరణలో..


కొడకండ్లలో..


చినుకుల్లో మహిళలు..

ఉత్సాహంగా ఎంగిలి పూల బతుకమ్మ

భక్తి ఉత్సాహాల నడుమ జనగామ జిల్లాలో మహిళలు తొమ్మిది రోజుల బతుకమ్మ పండగకు శ్రీకారం చుట్టారు. ఎంగిలి పూల బతుకమ్మ పండగను బుధవారం మహిళలు ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ దేవాలయాల్లో, కూడళ్లు, వాడవాడలా జరుపుకున్నారు. మహిళలు రంగురంగుల పూలతో అందంగా పేర్చి, ఒక చోట గుమిగూడి వివిధ పాటలతో కోలాటాలు, నృత్యాలతో ఆడిపాడారు. అనూహ్య వర్షంతో కొంతమేర ఇబ్బంది పడ్డారు. కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

– న్యూస్‌టుడే, యంత్రాంగం


పాలకుర్తి మండలం మంచుప్పులలో..


స్టేషన్‌ఘన్‌పూర్‌లో..


చిల్పూర్: మల్కాపూర్‌లో..


జఫర్‌గఢ్: కూనూర్‌లో..


కొత్తవాడ తోట మైదానంలో బతుకమ్మ ఆడుతున్న మంత్రి కొండా సురేఖ, మేయర్ సుధారాణి, జిల్లా పాలనాధికారి డా.సత్యశారద


తరిగొప్పుల: జగ్గయ్యపేటలో...


బచ్చన్నపేటలో..


నర్మెట్టలో..


దేవరుప్పులలో..

మేమున్నాం.. మీకు తోడుగా

జనగామ: 80085 74872
జనగామ అర్బన్: 80749 20132
పాలకుర్తి: 98663 66702
స్టేషన్‌ఘన్‌పూర్: 90521 83243
జఫర్‌గఢ్: 98662 50618
(10 AM TO 1 PM)

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: గ్రామంలో పిచ్చి మొక్కలు పెరిగి దోమలు, ఈగల బెడద ఎక్కువైంది. **- గ్రామస్థులు, లింగాలఘనపురం.**

సమాధానం: శుక్రవారం వీధులలో శుభ్రం చేయిస్తాం. **- ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, లింగాలఘనపురం**

☛ ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు వద్ద గేట్‌వాల్ లీకేజీ అవుతోంది. దీంతో నీరు వృథాగా పోయి బురదమయం అవుతోంది. మరమ్మతు చేయించాలి. **- గ్రామస్థులు, నెల్లుట్ల**

సమాధానం: గతంలో మరమ్మతు చేయించాం. పరిశీలించి మరోసారి చేయిస్తాం. **- శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, నెల్లుట్ల.**

పాలకుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని గూడూరులో ప్రధాన మురుగుకాల్వలో చెత్తచెదారం, పూడికమట్టి పేరుకుపోయింది. దుర్వాసన వస్తుంది. **- రమేశ్, గ్రామస్థుడు**

సమాధానం: సిబ్బందితో శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటా. **- రాములు, ఎంపీడీవో, పాలకుర్తి**

స్పందనకు వందనం

వెలిగిన వీధి దీపాలు

దేవరుప్పుల రూరల్: దేవరుప్పుల మండలం మాధాపురంలో గతంలో ఏర్పాటు చేసిన వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా వివరించారు. సమస్యను 'న్యూస్‌టుడే' పంచాయతీ కార్యదర్శి యాకన్నకు వివరించగా, సిబ్బందితో మరమ్మతు చేయించారు.

లీకేజీకి మరమ్మతు

దేవరుప్పుల రూరల్: మండలంలోని కామారెడ్డిగూడెంలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అయి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారనే సమస్యను 'న్యూస్‌టుడే' పంచాయతీ కార్యదర్శి స్వప్నకు వివరించింది. ఆమె వెంటనే స్పందించి, లీకేజీకి మరమ్మతులు చేయించారు.


జనగామ: సిద్దెంకిలో నేల కూలిన విద్యుత్తు స్తంభం


నర్మెట్ట-జనగామ రహదారిపై


రఘునాథపల్లి: కుర్చపల్లిలో..

వాన బీభత్సం

జనగామ రూరల్, నర్మెట్ట, రఘునాథపల్లి, న్యూస్‌టుడే: జనగామ, నర్మెట్ట మండలాల్లోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం కురిసిన వానతో పలు చోట్ల అంతరాయాలు ఏర్పడ్డాయి. విద్యుత్తు స్తంభం, చెట్లు నేలకూలడంతో ప్రజలు ఆందోళన చెందారు. రహదారులపై వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. కుర్చపల్లి మారమ్మ ఆలయం దారిలో గృహ సముదాయాల వద్ద ఓ చెట్టు విరిగి విద్యుత్ స్తంభంపై పడింది. విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. దాంతో ఆ గ్రామంలో అంధకారం ఏర్పడింది. బతుకమ్మ ఆడేందుకు ఇబ్బందులు కల్గకుండా ప్రత్యామ్నాయంగా విద్యుత్ సదుపాయాన్ని అధికారులు ఏర్పాటు చేశారు.

ఇనుప చక్రాలను అపహరించిన ఒకరి అరెస్టు

దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: వ్యవసాయ క్షేత్రం వద్ద నిల్వ చేసిన ట్రాక్టర్ ఇనుప చక్రాలను అపహరించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంపురానికి చెందిన వన్నెకాల భీమేష్ ఇటీవల తన పొలం వద్ద ట్రాక్టర్‌కు అమర్చిన ఇనుప చక్రాలను భద్రపరచగా గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లగా, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బుధవారం గొల్లపల్లి క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా కామారెడ్డిగూడానికి చెందిన తీగల సురేష్ ట్రాలీ వాహనంలో ఇనుప చక్రాలను తరలిస్తుండగా అనుమానంతో ఆరా తీయగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారని చెప్పారు. సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.

ద్విచక్ర వాహన దొంగ..

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: మండలంలోని శివునిపల్లిలో రహదారి పక్కన వంగ రమేష్ తన ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఫోన్ మాట్లాడుతున్నాడు. చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఛత్రం జంగడే వాహనాన్ని తీసుకొని పారిపోయాడు. బాధితుడు ఠాణాలో ఫిర్యాదు చేశారు. బుధవారం మండల కేంద్రంలోని అండర్ బ్రిడ్జి వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఛత్రం జంగడే ద్విచక్ర వాహనంతో అనుమానాస్పదంగా కనిపించారు. అదుపులోకి తీసుకొని విచారించగా వాహనం చోరీ చేసినట్లుగా అంగీకరించాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వేణు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని కంచనపల్లి గ్రామానికి చెందిన అమృతం చిన్న రాములు భార్య నర్సమ్మ (66) మంగళవారం నిత్యవసరాల కోసం బయటకు వెళ్లింది. మార్గమధ్యలో కింద పడడంతో తలకు తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు జనగామ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.నరేశ్ తెలిపారు.


ధ్రువపత్రాల పరిశీలన జాబితాను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

ధ్రువపత్రాల పరిశీలన కేంద్రం సందర్శన

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024 నియామకంలో భాగంగా సెకండరీ గ్రేడ్ టీచర్ విభాగంలో 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల నిజ ధ్రువపత్రాల పరిశీలనను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ జిల్లా విద్యాశాఖాధికారి కె.రాముతో కలిసి బుధవారం సందర్శించి, ధ్రువపత్రాల పరిశీలన తీరును ఆయన పరిశీలించారు. అక్కడున్న అభ్యర్థులతో మాట్లాడుతూ.. ఎలాంటి సందేహాలున్నా వెంటనే నివృత్తి చేసుకోవాలని వారికి సూచించారు.


దేవరుప్పుల: సీతారాంపురంలో ముగ్గుతో నివాళి..


కొడకండ్ల కాంగ్రెస్ కార్యాలయంలో...


పట్టణంలోని 25వ వార్డు కమ్యూనిటీ భవనంలో..


జనగామలో భాజపా నాయకులు..

ఘనంగా గాంధీ జయంతి

జాతిపిత మహాత్మగాంధీ జయంతి పురస్కరించుకొని బుధవారం జిల్లా వ్యాప్తంగా అధికారులు, రాజకీయ నాయకులు, పలు ప్రజా సంఘాల నేతలు గాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వాతంత్ర్యోద్యమంలో గాంధీజీ సేవలను కొనియాడారు. సత్యం, అహింసలతోనే చివరి వరకు పోరాడి స్వాతంత్ర్యం సాధించారని తెలిపారు. ఆయన నడిచిన బాట ఎంతో మందికి స్ఫూర్తినిస్తాయని అన్నారు.

– న్యూస్‌టుడే, బృందం


బచ్చన్నపేటలో..


లింగాలఘనపురం: కుందారంలో..


పాలకుర్తిలో..


నర్మెట్టలో సీఐ అబ్బయ్య, పోలీసులు


రఘునాథపల్లి మండలం కంచనపల్లిలో


జఫర్‌గఢ్: షాపల్లిలో..


స్టేషన్‌ఘన్‌పూర్‌లో కాంగ్రెస్ నాయకులు


దేవరుప్పుల: సీతారాంపురంలో..


జిల్లా కేంద్రం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..


జనగామ సబ్‌జైల్‌లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్


తరిగొప్పులలో....

స్వచ్ఛత కోసం పాటుపడాలి


స్వీపర్లను సన్మానించిన జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు, చిత్రంలో ఆర్టీసీ అధికారులు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ ఇచ్చిన స్ఫూర్తితో అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛత కోసం పాటుపడాలని జనగామ డిపో మేనేజర్ ఎస్.స్వాతి అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జనగామ బస్టాండ్‌లో స్వచ్ఛతసేవ కార్యక్రమంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. బస్‌స్టేషన్‌లో పారిశుద్ధ్యం విషయంలో ప్రయాణికులు సహకరించాలన్నారు. బస్టాండ్‌లో స్వీపర్లుగా పని చేస్తున్న వారిని ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు రవీందర్, ప్రతినిధులు ఉమాదేవి, శ్రీనివాస్‌రావు, చంద్రశేఖర్‌రావు, బాలరాజు, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.


గణేశ్‌వాడలో..

రంగుల తారలు దిగివచ్చిన చందంగా..

తారలు దిగివచ్చి రంగులద్దుకుని దీప కాంతులు విరజిమ్మే తోరణాలైన చందంగా జనగామలో దుర్గా నవరాత్రి ఉత్సవ వేదిక ప్రాంతాలు వెలుగులీనుతున్నాయి. స్థానిక గణేశ్‌వాడలో దశాబ్దం పైగా ఏటేటా నిర్వహిస్తున్న దుర్గామాత నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రంగు రంగుల విద్యుద్దీప తోరణాలతో వేసిన పందిళ్లు అందరినీ అలరిస్తున్నాయి. – జనగామ, న్యూస్‌టుడే

ఆవిడకు కొలువొచ్చింది.. ఆయనకు చేయూతైంది!



జనగామ అర్బన్, న్యూస్‌టుడే: చేతిలో మూడు నెలల చంటిపాపను పట్టుకొని, పక్కనే సర్టిఫికెట్లను సరిచూసుకుంటున్న దంపతులు శివరాత్రి సాయికృష్ణ-శ్రీలత. వీరిది పాలకుర్తి. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీ విభాగంలో ఉద్యోగానికి ఎంపిక కాబడిన శ్రీలత జనగామలోని ప్రిస్టన్ కళాశాలలో జరుగుతున్న ధ్రువపత్రాల పరిశీలనకు తన మూడు నెలల పాపతో హాజరైంది. విద్యార్హత తల నకలు పత్రాలను సరిచేసుకుంటున్న క్రమంలో పాప నిద్రలోకి జారుకుంది. తోడుగా వచ్చిన భర్త సాయికృష్ణ ఆ పాపని ఒడిలో పెట్టుకొని, ఆవిడకు అవసరమగు పత్రాలను అందిస్తూ సాయపడ్డాడు. ఎల్ఈడీ బల్బుల డిస్ట్రిబ్యూటర్‌గా పనిచేస్తూ, చదువుపై భార్యకు ఉన్న ఆసక్తిని గ్రహించి చదువుకునేలా ప్రోత్సహించడంతో ఆమెకు కొలువొచ్చింది.. ఆయనకు ఆసరాగా నిలిచింది.


నెహ్రూపార్కు బస్టాండు రోడ్డులో..

కమ్ముకున్న కారుమబ్బులు

జనగామ, న్యూస్‌టుడే: గత కొద్ది రోజులుగా వేసవిని తలపించేలా ఎండలు ఠారెత్తిస్తున్నాయి. బుధవారం మధ్యాహ్నం జనగామలో ఆకస్మికంగా వాతావరణం చల్లబడింది. పట్టణాన్ని ఓ వైపు కాలమేఘాలు, మరోవైపు తెల్లమబ్బులు కమ్మేశాయి. చిరు గాలులతో దిగివచ్చిన మేఘాలు ఓ మోస్తరు జల్లులు కురిపించడంతో జనం ఉపశమనం పొందారు. ఆకాశం మేఘాలతో కొత్త అందాలను సంతరించుకోవడం ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేసింది.

వివక్ష నిర్మూలనకు పాటుపడుదాం

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: కుల వివక్ష నిర్మూళన కోసం పాటుపడుదామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవదానం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సంఘం 26వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఉప్పలయ్య అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు శేఖర్, పరుశురాములు, లావణ్య, మేరీ, శోభ, రమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా నల్ల నరసింహులు జయంతి

దేవరుప్పుల రూరల్, జనగామ టౌన్, న్యూస్‌టుడే: తెలంగాణ సాయుధ పోరాటంలో అమరుడైన నల్ల నరసింహులు జయంతిని గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం దేవరుప్పుల మండలం కడవెండిలో ఆయన స్థూపానికి గ్రామస్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచి బెతిలీనా మాట్లాడుతూ.. నిజాం ప్రభుత్వాన్ని కూల్చడానికి నరసింహులు కడవెండి నుంచి గెరిల్లా సమరాన్ని నడిపించారన్నారు. కార్యక్రమంలో భారాస నాయకులు పల్లా సుందర్‌రాంరెడ్డి, హనుమంతు, చింత రవి, నక్క రమేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే జనగామలో పద్మశాలి అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్(పోపా) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బతుకమ్మకుంట రోడ్డు వైపు ఉన్న నల్లా నర్సింహులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పోపా ప్రతినిధులు వెంకటేశ్వర్లు, పిట్టల సతీష్, తదితరులు పాల్గొన్నారు.


దేవరుప్పుల: కడవెండిలో..

అన్నదానం.. అభినందనీయం!


అన్నప్రసాదం కోసం బారులు తీరిన ప్రజలు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ పట్టణంలోని నెహ్రూ పార్కు సెంటర్‌లో గత రెండేళ్లుగా ప్రతి నెల అమావాస్య నాడు వాసవి కన్యకా పరమేశ్వరి సేవా సమితి ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్నదానం చేస్తున్నారు. దాతల కోసం సంప్రదిస్తూ కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే.. వారి సంస్మరణార్థం అన్నదాన ఖర్చును ఇవ్వాలని కోరుతూ సభ్యులు అలాంటి దాతలతో కలిసి అన్నదానం చేస్తున్నారు. బుధవారం నిర్వహించడంతో వారిని అన్ని వర్గాల ప్రజలు అభినందిస్తున్నారు.

పాలకుర్తి, న్యూస్‌టుడే: పితృ అమావాస్యను పురస్కరించుకొని మండల కేంద్రంలో బుధవారం పలువురు మహాన్నదానం నిర్వహించారు. స్థానికులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నంగునూరి మధు, రామగిరి నాగరాజు రాజీవ్‌చౌరస్తా వద్ద 300 మందికి అన్నదానం చేశారు. సోమేశ్వరాలయంలో ఇమ్మడి కుటుంబసభ్యులు 200 మందికి అన్నప్రసాదం అందజేశారు.

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: జఫర్‌గడ్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని గాంధీ కూడలిలో అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పండగ రోజు ప్రజలు పస్తులు ఉండవద్దనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.